# బెట్

## కల్యాణీదేవి

తెలుగు సినిమాలు బీరు పోకుండా చూసే మోహన్ బావమరుదులు శోభనం గదిని సినిమాలోలాగే అలంకరించారు శక్తివంచన లేకుండా అది చూసి మురిసిపోయి గదిలోకి రాబోయే శ్రీమతిని, తను గడపబోయే రాత్రి గురించి టెక్నికలర్ కలకంటూ కళ్లు మూసుకున్నాడు మోహన్

ఎంతసేపు గడిచిందో కాని పెళ్లికూతురు గదిలోకి వచ్చేసి తగు మోతాదులో సిగ్గుపడ్తూ పాలగ్లాసు పట్టుకుని నిలబడింది

కళ్లు తెరిచి చూసి, అచ్చు సినిమాలో హీరోలాగా పెళ్ళికూతుర్ని రిసీవ్ చేసుకున్నాడు

ప్రథమాంకం చాలా రొమాంటిక్‌గా గడిచింది. ఆ తర్వాత- -

"జ్యోతి నీ అలవాట్లేమిటి?" ఎంతో మృదువుగా స్టైలుగా అడిగాడు

"అంటె?" సున్నితంగా కనుబొమ్మలు వంగాయి

"అంటే . నీకేమిటేమిటి ఇష్టం.. ఎలాంటివి ఇష్టం? సాధారణంగా చీరలు. నగలు నాట్యాలు, సినిమాలు, అలంకారాలు ఇలాంటి వాటన్నిట్లో నీకేది ఎక్కువ ఇష్టం అని "

"నాకన్ని ఇష్టమే అనుకోండి కాకపోతే " నసిగింది

"చెప్పు జ్యోతీ. ." ముద్దుగా పట్టుపట్టాడు

"అంటె సందర్భానుసారంగా నాకు బుద్ధిపుట్తూ వుంటుంది "

హీరోయిన్‌లాగా నవ్వింది అతని కళ్లలోకి చూస్తూ.

మోహన్‌కి అర్థం కాలేదు.

"సరిగ్గా చెప్పు జ్యోతి."

"అసలు విషయం మీకొకటి చెప్పాలి నాకంటూ ఓ ప్రత్యేకమైన కోరికలుండి ఇది కానండి అని అడగను కాకపోతే నాకు బెట్ కట్టే అలవాటు ఒకటుంది మా స్నేహితులతో ఎప్పుడూ పందాలు కట్తూ వుంటాను. అఫ్‌కోర్స్ . ఎప్పుడూ గెలుస్తాననుకోండి "

"ఓహో. "

"నాకు బోల్డుమంది స్నేహితులున్నారు. వాళ్ళం చీరకొన్నా, నగలుకొన్నా కాస్మటిక్స్‌కొన్నా, చివరికి ఏ సినిమా చూసినా బెట్టుకాసి మరీ వాళ్ల




కంటె మంచివి కొనుక్కుంటాను. అంతకు మించి నేను ప్రత్యేకంగా ఏమీ అడగను సుమా "

వింటున్న మోహన్ గుండె ఆగినంత పనయింది

ఏమిటి? ఇంతకు మించి అడగదా? ఇంతకంటె తనని ముంచడానికి వేరే ఏం కావాలి కనుక మొదటి రాత్రే ఆమె అలవాటుని విమర్శించడం ఎందుకని పైకి నవ్వాడు.

"అలా బెట్లు కట్టటం మించి నాకు చెప్పుకోదగ్గ అలవాటు ఇంకేం లేదండి. " ఎంతో ముద్దుగా అన్నది జ్యోతి.

"ఊహుఁ. ప్రస్తుతం ఏదైనా బెట్టు కట్టావా?.." పైకి నవ్వుతూ అడిగినా లోలోపల తెగ మధనపడసాగాడు భార్యామణి అలవాటుకి, "అబ్బెమీరెంత మంచివారండి నా బెట్ల గురించి ఇంత శ్రద్ధమాపించే భర్త దొరకడం నిజంగా నా అదృష్టం పెద్ద మా వసంత కొత్తరకం షిఫాన్ చీరకట్టు కొచ్చి తెగపోజులిస్తుంటే మండిపోయి దాంతో బెట్టుకట్టాను "'ఎంతో' వుత్సాహంగా చెప్పింది జ్యోతి. జారిపోతున్న గుండెతో, హీనస్వరంతో, "ఏమని కట్టావ్?"- "ఏంవుంది రేపు సాయంత్రంకల్లా మాశ్రీవారితో అలాంటి చీర కొనిపించుకుంటాను అప్టరాల్ నాలు గొందలే కదా? మావారు పెద్దవుద్యోగస్థులు. నాకోరిక తీర్చరేమిటి అని బెట్టుకట్టాను ఆయ్యెయ్యొ.. అదే మిటండీ అలా అయిపోతున్నా రేమిటి? "

పరుపుమీదకి జారిపోయిన మోహన్ భవిష్యత్తులో తన భార్య బెట్లకి తనెలా సహకరించాలో అర్థంకాక మూర్ఛవచ్చినంత పనయింది. ★

## బలిమి

జీవన మహా ప్రవాహాని
కెదురీత శక్తి నిచ్చేది
ఎదలుపిండి నింపుకున్న
ధన మద బలం వాపు కాదు
స్పందన హృదిలో రగిలిన
మహోన్నత మానవత్వపు
చైతన్యపు చెలిమి బలిమి.

మాధవరపు వి.ఎస్. లక్ష్మి